సాక్షి ములుగు

శుక్రవారం । 7 । ఏప్రిల్ । 2023



కేఎంసీకి రీసెర్చ్ యూనిట్

వరంగల్‌లోని కాకతీయ మెడికల్ కళాశాలలో రీసెర్చ్ యూనిట్ ఏర్పాటు చేయడానికి కేంద్ర ప్రభుత్వం రూ.1.25 కోట్లు మంజూరు చేసింది.

- 8లో



సింగిల్ పట్టి @రూ.67వేలు

వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌కు గురువారం రైతులు తెచ్చిన సింగిల్ పట్టి రకం మిర్చి క్వింటాకు రూ.67వేల ధర పలికింది.

- 8లో

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 36.0° /24.0°

జిల్లాలో ఉదయం ఆకాశం మేఘా వృతమై ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఎక్కువ గా ఉంటుంది. రాత్రి సమయంలో సాధారణ పరిస్థితి ఉంటుంది.

రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
శుక్ర 6:35	శని 4:42

ఫారెస్ట్ X రెవెన్యూ

ఎన్‌హెచ్ విస్తరణ పనుల్లో అధికారుల వాగ్వాదం

- మల్లంపల్లి టు గట్టమ్మ వరకు నిలిచిపోయిన పనులు
- ఏరియా మాదంటే మాదంటూ గగ్గోలు
- వేరే దగ్గర భూమి ఇవ్వాలంటున్న అటవీ శాఖ
- ఒప్పుకోని రెవెన్యూ శాఖ



మల్లంపల్లి-జాకారం మధ్యలో నిలిచిపోయిన ఎన్‌హెచ్ పనులు

ములుగు: జాతీయ రహదారి విస్తరణ పనుల్లో రెవెన్యూ, అటవీ శాఖ అధికారులకు పొంతన కుదరడం లేదు. దీంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోతున్నాయి. ఆరెపల్లి నుంచి ములుగు మండలం గట్టమ్మ ఆలయం వరకు రోడ్డు విస్తరణకు అనుమతులు రావడంతో సంబంధిత శాఖ టెండర్ పిలిచి పనులు చేపట్టింది. ములుగు మండల పరిధిలోని మహ్మద్‌గౌస్ పల్లి నుంచి మల్లంపల్లి శ్రీరాంసాగర్ ప్రాజెక్టు కెనాల్ వరకు పనులు శరవేగంగా సాగుతున్నాయి. జాకారం ఫారెస్ట్ కంపార్ట్‌మెంట్ 598, 599, 680 పరిధిలోని కెనాల్ నుంచి జాకారం సాంఘీక సంక్షేమ గురుకులం పక్కన ఉన్న నాగిరెడ్డికుంట వరకు, గట్టమ్మ ఆలయం నుంచి పానేస కాల్వ వరకు పనులు నిలిచిపోయాయి. ఈ భూమి మాదంటే మాది అంటూ అటవీ, రెవెన్యూ శాఖల అధికారులు భీష్మించుకుని కూర్చోవడంతో సమస్య ఉత్పన్నం అయ్యింది.

వేరే దగ్గర భూమి ఇవ్వాలని..

వాస్తవానికి కెనాల్ నుంచి ఇరువైపులా ఉన్న భూమి అన్యాక్రాంతం కాకుండా కొన్ని సంవత్సరాలుగా అటవీ శాఖ సంరక్షించుకుంటూ వస్తోంది. ఎన్‌హెచ్ రోడ్డు పక్కన విలువైన టేకు, కొడిశ, నల్లమద్ది, ఏరుమద్ది, బిలుగు, సండ్ర, గుల్‌మోహర్, సిస్సు, నెమలినార, నారేప, చిందుగ వంటి చెట్లను ఇతరులు కొట్టకుండా ఈ ప్రదేశం చుట్టూ ట్రెంచ్ వేసింది. అయితే ఇప్పుడు రెవెన్యూ పరిధిలో సర్వే నంబర్ 53/2, 53/19 భూమి రెవెన్యూకు సంబంధించిన ఆస్తి అని పంచాయతీని మొదటికి తీసుకువచ్చింది. ఈ క్రమంలో ఇరు శాఖల అధికారులు తమతమ దగ్గర ఉన్న ఆధారాలతో పలుమార్లు చర్చలు జరిపారు. అయినా విషయం కొలిక్కి రాలేదు. ఎన్‌హెచ్ పక్కన ఉన్న భూమి మా దేనని, ఒక వేళ విస్తరణకు భూమిని తీసుకుంటే ఇరువైపులా 12.5 మీటర్ల చొప్పున 11.34 ఎకరాల భూమిని మరోచోట అప్పగించాలని అటవీ శాఖ ప్రపోజల్ పెట్టింది. అయితే దీనికి రెవెన్యూ శాఖ ఒప్పుకోలేదని తెలుస్తోంది. ఇదిలా ఉంటే ఉన్న చెట్లను కొట్టేసే క్రమంలో కాంపన్‌స్ట్రేషనరీ ఎఫారెస్ట్రేషన్ కింద రూ.16 లక్షలు చెల్లించాలని పెట్టిన ప్రపోజల్స్‌కు సైతం ససేమీరా ఒప్పుకోకపోవడంతో అప్పటి డీఎఫ్ఓ కిష్టాగౌడ్ పలుమార్లు పనులకు అడ్డుతగిలినట్లుగా తెలుస్తుంది. ఈ క్రమంలో డీఎఫ్ఓపై ఫిర్యాదులు అందాయని, ఆయన బదిలీకి ఇది ఒక కారణమని తెలుస్తుంది.

ఎన్‌హెచ్ అధికారులకు నోటీసులు

ఎన్‌హెచ్ విస్తరణ విషయం లోలోపల చిలికిచిలికి గాలివానగా మారుతుందని ఇరుశాఖల మధ్య గుసగుసలు వినిపిస్తున్నాయి. ఫిర్యాదులతో ఇటు పీసీసీఎఫ్, అటు సీఎస్‌కు ఫైల్స్ అందాయని సమాచారం. దీంతో స్పందించిన పీసీసీఎఫ్ నేషనల్ హైవే వరంగల్ డివిజన్ అధికారులకు ఫారెస్ట్ కన్జర్వేషన్ యాక్ట్(ఎఫ్‌సీ)-1980 ప్రకారం నోటీసులు జారీ చేసినట్లుగా తెలుస్తుంది. దీంతోపాటు నేషనల్ హైవే ఇరువైపులా చెట్లకు సంబంధించిన సర్వే చేపట్టకూడదని సిరికల్చర్, హార్టికల్చర్ అధికారులకు ఎఫ్‌సీ యాక్ట్ ప్రకారం నోటీసులు ఇచ్చింది. అయినా అధికారులు చెట్లకు నంబరింగ్ ఇస్తున్నట్లుగా అటవీ అధికారవర్గాలు చెబుతున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా పనులు చేపడితే ఖచ్చితంగా అడ్డుకొని తీరుతామని అటవీ అధికారులు పట్టుపట్టి కూర్చున్నారు. ఈ విషయంలో ఇరుశాఖల రాష్ట్రస్థాయి అధికారులు రాజీకి వస్తే తప్పా కెనాల్ నుంచి నాగిరెడ్డి కుంట వరకు, డీబీఎం-38 కెనాల్(పానేసా కాల్వ) నుంచి గట్టమ్మ మధ్యలో విస్తరణ పనులు జరిగేలా కనిపించడం లేదు.

గతంలోనూ అంతే..

సమీకృత కలెక్టరేట్ కార్యాలయ పనుల్లో భాగంగా స్థల సేకరణ సమయంలో రెవెన్యూ-అటవీ అధికారులకు భూమి హద్దుల విషయంలో ఇదే విధంగా జరిగింది. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ పనులు చేపట్టడం అటవీ అధికారులు అడ్డుకోవడం పలుమార్లు జరిగింది. దీంతో అటవీ అధికారులు సంబంధిత కాంట్రాక్టర్, అధికారులపై ఎఫ్‌సీ-1980 చట్టం కింద కేసు పెట్టారు. ప్రస్తుతం అది కొనసాగుతోంది.

వైద్యుల పనితీరుపై అసంతృప్తి



మాట్లాడుతున్న ఐటీడీఏ పీఓ అంకిత్



హాజరైన వైద్యులు, స్టాఫ్ నర్సులు

ఐటీడీఏ పీఓ అంకిత్

ఏటూరునాగారం: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు, సిబ్బంది పనితీరు బాగోలేదని, అనుకున్న లక్ష్యాలను చేరుకోవడం లేదని ఐటీడీఏ పీఓ అంకిత్ అసంతృప్తి వ్యక్తం చేశారు. మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయం ఆవరణలో గురువారం వైద్యాధికారులు, సిబ్బందితో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని మారుమూల గ్రామాల్లో డెలవరీ అయ్యే గర్భిణుల వివరాలను పూర్తి స్థాయిలో తెలుసుకొని ప్రభుత్వ ఆస్పత్రిలోనే ప్రసవాలు జరిగేలా ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు చూడాలన్నారు. మార్చిలో మాతా, శిశు సంరక్షణ ప్రోగ్రాంలో పీహెచ్‌సీలకు డెలవరీల టార్గెట్, రక్తహీనత కేసులను నివారించడం, ఏఎంసీ నమోదు కార్యక్రమాలను లక్ష్యాలకు ఎందుకు పూర్తి చేయలేదని కన్నాయిగూడెం, వెంకటాపురం(కె), మంగపేట, రొయ్యూర్, గోవిందరావుపేట పీహెచ్‌సీల వైద్యులు, సిబ్బందిని ప్రశ్నించారు. ఏప్రిల్ నెలలో ఉన్న టార్గెట్‌ను అయినా పూర్తి చేయాలని హెచ్చరించారు. రక్తహీనత సమస్య ఉన్న బాలింతలకు ప్రభుత్వం అందిస్తున్న న్యూట్రిషన్ కిట్లను అందజేసి 15 రోజుల తర్వాత పరీక్ష చేసి రక్తం పెరుగుదలను గుర్తించాలన్నారు. రక్తహీనత శాతం ఎంత ఉంది లేదని ఆన్‌లైన్‌లో మానిటరింగ్ చేయనున్నట్లు తెలిపారు. బర్త్ ప్లానింగ్ చేయించాలన్నారు. పూర్ సబ్ సెంటర్ల పనితీరు మెరుగుపడాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్ఓ అప్పయ్య, ప్రోగ్రాం ఆఫీసర్ వెంకటేశ్వర్‌రావు, ఐదు మండలాల పీహెచ్‌సీల వైద్యులు పాల్గొన్నారు.

నిరుపేదల ఇళ్లు కూల్చడం సరికాదు



కూల్చివేసిన ఇంటిని పరిశీలిస్తున్న రవీందర్

ములుగు రూరల్: నిరుపేద కూలీల ఇళ్లు కూల్చడం సరికాదని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి జంపాల రవీందర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రేమ్‌నగర్ వ్యవసాయ మార్కెట్ సమీపంలో ఇళ్లు నిర్మించుకొని జీవిస్తున్న నిరుపేదల ఇళ్లను కూల్చి వేయగా ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 30 సంవత్సరాల క్రితం ఇంటి స్థలాలు కొనుగోలు చేసి ఇళ్లు నిర్మించుకొని జీవనం కొనసాగిస్తున్న వారి ఇళ్లను తొలగించడంతో నిరాశ్రయులయ్యారని తెలిపారు. ఇంటిని కూల్చి వేస్తున్నారని మనోవేదనకు గురైన తుమ్మ చెంచురెడ్డి పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడని తెలిపారు. ఈ విషయంపై తహసీల్దార్ సత్యనారాయణ స్వామిని వివరణ కోరగా జిల్లా కేంద్రంలో 1063 సర్వే నంబర్‌లో నిర్మిస్తున్న మెడికల్ కాలేజీకి మార్కెట్ యార్డు సమీపంలోని ప్రభుత్వ భూమిని కేటాయించామని తెలిపారు. ప్రభుత్వ భూమిలో ఇళ్లు నిర్మించుకున్న వారికి నోటీసులు జారీ చేశామని తెలిపారు. బాధితులు కోర్టును ఆశ్రయించగా శాఖ ఆధ్వర్యంలో కోర్టును ఆశ్రయించామని తెలిపారు. కోర్టు బాధితుల పిటీషన్ కొట్టి వేసి పూర్తి అధికారాలు రెవెన్యూ శాఖకు అప్పగించిందని తెలిపారు. బాధితులకు శాఖ తరపున మరోమారు నోటీసులు జారీ చేసినా స్పందించకపోవడంతో ఇళ్లను తొలిగించామని తెలిపారు.

న్యూస్‌రీల్

కూలీల డబ్బులు సకాలంలో చెల్లించాలి



ములుగు రూరల్: ఉపాధి కూలీల డబ్బులను సకాలంలో చెల్లించాలని గ్రంథాలయ చైర్మన్ పోరిక గోవింద్‌నాయక్ అన్నారు. మండల పరిధిలోని భూపాల్‌నగర్ శివారులో ఉపాధి పనులు చేస్తున్న కూలీలకు గురువారం ఆయన పండ్లు పంపిణీ చేసి మాట్లాడారు. పని ప్రదేశాల్లో కూలీలకు తాగునీరు, టెంట్లు, ప్రథమ చికిత్సకు అవసరమయ్యే కిట్లు అందుబాటులో ఉంచాలన్నారు. జాతీయ ఉపాధి హామీ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుందన్నారు. గత సంవత్సరం చేసిన పనుల డబ్బులు రాలేదని కూలీలు తెలుపగా ఆయన ఏపీఓతో ఫోన్‌లో మాట్లాడి సకాలంలో డబ్బులు చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

'అధికార పార్టీ ఎమ్మెల్యేలు ధర్నాలు చేయడం సిగ్గుచేటు'

భూపాలపల్లి అర్బన్: సీఎం కేసీఆర్ సింగరేణి ఓపెన్‌కాస్టులు, భూగర్భ గనుల్లో ప్రైవేటీకరణను ప్రోత్సహిస్తుంటే అధికార పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ధర్నాలు చేయడం సిగ్గుచేటని ఐఎన్‌టీయూసీ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు జోగు బుచ్చయ్య ఆరోపించారు. ఏరియాలోని యూనియన్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2014 సంవత్సరంలో కేసీఆర్ సీఎం అయిన తరువాత సింగరేణిలో అతిపెద్ద ఓపెన్‌కాస్టు తాడిచెర్ల బ్లాక్‌ను 55సంవత్సరాల పాటు ప్రైవేట్ కంపెనీకి అప్పగించినట్లు తెలిపారు. ప్రభుత్వంలో ఉన్నటువంటి ఎమ్మెల్యేలు, టీబీజీకేఎస్ నాయకులు ఖమ్మం నుంచి ఆదిలాబాద్ వరకు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ఖమ్మం జిల్లాలో కొంత మంది ఎమ్మెల్యేలు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ధర్నాలు చేయడం సిగ్గుచేటన్నారు. ఈ సమావేశంలో నాయకులు వేణుగోపాల్, జనార్ధన్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

లారీ యజమానుల మధ్య ఘర్షణ

భూపాలపల్లి అర్బన్/గణపురం: భూపాలపల్లి, గణపురం మండలాల లారీ అసోసియేషన్ యజమానుల మధ్య గురువారం ఘర్షణ చోటుచేసుకుంది. రెండు మండలాలకు చెందిన యజమానులు రాళ్లు, కర్రలతో భూపాలపల్లి, బస్వరాజుపల్లి కేటీకే 8వ గని వద్ద కొట్టుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. రెండు అసోసియేషన్లకు భూపాలపల్లి ఏరియాకు చెందిన కోల్ ట్రాన్స్‌పోర్టులు ప్రతిరోజూ బొగ్గు రావాణాకు పర్మిట్లు ఇస్తారు. అందుకు యజమానులు ట్రాన్స్‌పోర్టు గుమాస్తాలకు ప్రతీ లారీకు రూ.100 ఇవ్వాల్సి ఉంటుంది. గతంలో చేసిన ఒప్పందాన్ని అమలు చేయకుండా రూ.100 బదులుగా రూ.300 ఇవ్వాలని గుమాస్తాలు డిమాండ్ చేయగా భూపాలపల్లికి చెందిన లారీ యజమానులు రూ.300 చెల్లిస్తూ పర్మిట్లు తీసుకుంటున్నారు. దీంతో గణపురం యజమానులు భూపాలపల్లికి చెందిన యజమానులతో సంప్రదించి గుమాస్తా డబ్బులు పాత విధంగానే ఇద్దామని పర్మిట్లు తీసుకోకుండా ఉండాలని కోరారు. అయినప్పటికీ స్థానిక యజమానులు వారి మాట వినకుండా పర్మిట్లు తీసుకుంటు లారీలను పంపిస్తున్నారు. దీంతో మూడు రోజుల క్రితం కేటీకే 8వ గని వద్ద భూపాలపల్లి లారీలను గణపురం అసోసియేషన్ నాయకులు అడ్డుకున్నారు. జీఎం కార్యాలయం, లారీ అసోసియేషన్ కార్యాలయంలో మాట్లాడేందుకు మహేందర్, గండ్రతి సురేందర్, సతీష్‌లు వచ్చి మాట్లాడి వెళ్లుతున్న క్రమంలో భూపాలపల్లికి చెందిన కొందరు వారిపై దాడికి పాల్పడినట్లు తెలిసింది. వారిపై దాడి చేయడమే కాకుండా కార్యాలయంలో వేసి బంధించారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి బయటికి పంపించారు. అనంతరం భూపాలపల్లి నుంచి కొంతమంది యజమానులు కేటీకే 8వ గని వద్దకు వెళ్లి అక్కడ ఉన్న గణపురం అసోసియేషన్ నాయకులపై దాడి చేసేందుకు ప్రయత్నించడంతో ప్రతి దాడులు చేసుకున్నారు. ఈ దాడిలో భూపాలపల్లికి చెందిన యజమానులకు గాయాలైనట్లు సమాచారం. ఈ వర్గాల వారు వేర్వేరుగా భూపాలపల్లి, గణపురం పోలీస్‌స్టేషన్లలో ఫిర్యాదులు చేసుకున్నట్లు తెలిసింది.

గాలి బీభత్సం

విరిగిన విద్యుత్ స్తంభాలు



విరిగి పడిన విద్యుత్‌స్తంభం, తెగి పడిన వైర్లు

వాజేడు: మండల కేంద్రంలో గురువారం సాయంత్రం గాలి బీభత్సం సృష్టించింది. జోరుగా వచ్చిన గాలికి రెండు విద్యుత్ స్తంభాలు విరిగి పడటంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. ఒక్కసారిగా వచ్చిన గాలికి దంతులూరి సుందర నర్సింహరావు ఇంటి సమీపంలో రహదారి పక్కన ఉన్న చెట్టు విరిగి విద్యుత్ లైన్‌పై పడింది. దీంతో పక్కన ఉన్న విద్యుత్ స్తంభం విరిగి పడింది. అదే విధంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఉన్న మరో విద్యుత్ స్తంభం విరిగింది. దీంతో విద్యుత్ వైర్లు తెగి రోడ్డుపై పడ్డాయి. స్థానికుల సమాచారంతో విద్యుత్ అధికారులు సరఫరాను నిలిపివేశారు.

పోడు పోరాటంలో ఆగిన గుండె



మృతదేహంతో జిల్లా అటవీ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న కుటుంబ సభ్యులు, బంధువులు

మల్హర్: పోడు పట్టా ఇచ్చిన భూమికి పూర్తిస్థాయి హక్కుల కోసం పోరాడి, ఫలితం అలిసిపోయిన ఓ గిరిజన రైతు గుండె ఆగింది. రైతు మృతికి అటవీశాఖ అధికారులే కారణమంటూ కుటుంబ సభ్యులు, గిరిజనులు మృతదేహంతో భూపాలపల్లి జిల్లా అటవీ కార్యాలయంలో ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ ఘటన గురువారం జరిగింది. కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మల్హర్ మండలం ఎడ్లపల్లి గ్రామానికి చెందిన భూక్య రాజునాయక్ (35)కు వైఎస్ఆర్ హయాంలో ఎడ్లపల్లి శివారులోని 5ఎకరాల అటవీ భూమికి సంబంధించిన హక్కు పత్రాలు అందించారు. హక్కు పత్రాలు, లోకేషన్ మ్యాప్ ఆధారంగా ఎడ్లపల్లి బొగ్గుల శివారులోని భూమి వద్దకు వెళ్తుండేవాడు. మోకాకు వెళ్తున్న ప్రతిసారీ భూమి లేందటూ ఫారెస్ట్ అధికారులు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. ఐదేళ్ల క్రితం లొకేషన్ వద్దకు వెళ్లిన రాజునాయక్‌కు అప్పటి ఫారెస్ట్ అధికారులు అడ్డు చెప్పడంతో పురుగుల మందు కూడా తాగాడు. ఫారెస్ట్ అధికారులే సొంత ఖర్చులు భరించి చికిత్స కూడా చేయించారు. ప్రభుత్వం ఇచ్చిన మ్యాప్‌లో కాకుండా వేరే చోటు భూమి చూపిస్తామని హామీ ఇచ్చిన అధికారులు నేటివరకు భూమి చూపించలేదని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. మూడు రోజుల క్రితం న్యాయం చేయాలని దేశ రాజధాని ఢిల్లీలోని ఎస్టీ కమిషన్‌కు వెళ్లినట్లు తెలిపారు. అటవీ శాఖ అధికారుల తీరుతోనే మనోవేదనకు గురై గుండెపోటు వచ్చి మృతిచెందినట్లు అతని భార్య ఆరోపించింది.

మృతదేహంతో ధర్నా

రాజునాయక్‌కు గురువారం ఉదయం గుండెపోటు రావడంతో చికిత్స నిమిత్తం భూపాలపల్లి తరలించారు. ఆస్పత్రికి చేరుకునేలోపే మృతిచెందాడు. న్యాయం చేయాలంటూ మృతదేహంతో జిల్లా అటవీ కార్యాలయం ఎదుట జాతీయ రహదారిపై కుటుంబ సభ్యులు, బంధువులు, గిరిజన నాయకులు సాయంత్రం 5 గంటల వరకు ధర్నా నిర్వహించారు. అధికారులు, పోలీసులు న్యాయం జరిగేలా చూస్తామని తెలపడంతో ధర్నా విరమించారు. కుటుం సభ్యుల ఫిర్యాధు మేరకు కాటారం పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మహదేవపూర్‌కు తరలించారు.

ఆరోగ్యమే మహాభాగ్యం



మాట్లాడుతున్న జడ్జి లలిత శివజ్యోతి

ములుగు: ప్రతిఒక్కరూ ఆరోగ్యంగా ఉంటేనే ఏ ప్రాంతమైనా బాగుంటుందని, మన పూర్వీకులు సైతం ఆరోగ్యమే మహాభాగ్యమని తెలిపారని జిల్లా ప్రధాన న్యాయమూర్తి పీవీపీ లలిత శివజ్యోతి అన్నారు. జిల్లా కేంద్రంలో జాతీయ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థల సూచనల మేరకు జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం ఏరియా ఆస్పత్రిలో నిర్వహించారు. ములుగులో ఆరోగ్యం సూత్రాలపై అవగాహన సదస్సు, మెడికల్ క్యాంపును చేపట్టారు. అనంతరం రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా లలిత శివజ్యోతి హాజరై మాట్లాడారు. ప్రజలందరూ మెరుగైన ఆరోగ్యంతో జీవించాలనే ముఖ్య ఉద్దేశంతో ఏటా ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని తెలిపారు. మంచి ఆరోగ్యానికి మించిన ఆస్తి లేదన్నారు. 1948 ఏప్రిల్ 7న ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో ప్రపంచ ఆరోగ్య సంస్థ ఏర్పాటు అయ్యిందన్నారు. ఈ ఏడాది వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ థీమ్ హెల్త్ ఫర్ ఆల్ నినాదంతో ముందుకెళ్తుందని తెలిపారు. ప్రజలు వివిధ రోగాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు రక్షిత మంచినీటి సరఫరా అత్యవసర సమయంలో ఆరోగ్యకరమైన అంశాలపై కోఆర్డినేషన్ వాతావరణంలో వచ్చే మార్పులను అధిగమించాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ పిలుపునిస్తుందన్నారు. ఆరోగ్యంగా ఉండేందుకు వ్యాయామం చేస్తూ పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. కోవిడ్‌తో ప్రతిఒక్కరిలో ఆరోగ్యంపై శ్రద్ధ పెరిగిందన్నారు. వ్యాధుల నుంచి తప్పించుకునేందుకు రోగ నిరోధక శక్తిని పెంచే సమతుల ఆహారంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి మాధవి, ములుగు ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ పి.జగదీశ్వర్, నర్సింగ్ సూపరింటెండెంట్ మేరీ, బార్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాలచారి, ఏజీపీ చంద్రయ్య, అడ్వకేట్‌లు సునీల్‌కుమార్, బానోతు స్వామిదాస్, రాజేందర్, రవీందర్, వైద్యులు రఘు, గణేష్, సరోజిని, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయురాలిని విధుల్లోకి తీసుకోవాలి

భూపాలపల్లి అర్బన్: పదో తరగతి వార్షిక పరీక్షల్లో భాగంగా కమలాపూర్ పాఠశాలలో విధులు నిర్వర్తిస్తున్న ఉపాధ్యాయురాలు సబియా మదాహత్‌ను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్‌పీసీ) నాయకులు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని డీఈఓ కార్యాలయ ఆవరణంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. కమలాపూర్ పరీక్ష కేంద్రం నుంచి పదో తరగతి హిందీ పేపర్ లీక్ కావడంలో ఇన్విజిలేటర్ ప్రమేయం లేదన్నారు. ముందస్తుగా వేసుకున్న పథకం ప్రకారం కిటికీ సమీపంలో కూర్చున్న విద్యార్థి బయటి నుంచి వచ్చిన వ్యక్తికి సహకరించడం వల్లే పేపర్ లీకైనట్లు నాయకులు తెలిపారు. ఈ సమావేశంలో నాయకులు రాజమల్లయ్య, రామణారెడ్డి, రఘుపతిరెడ్డి, సేవానాయక్, రమేష్, తిరుపతిలు పాల్గొన్నారు.

చేపల పెంపకం లాభదాయకం



నైపుణ్య పరీక్షలు నిర్వహించిన గిరిజనులతో అధికారులు

ఎస్ఎస్‌తాడ్వాయి: చేపల పెంపకం లాభదాయకంగా ఉంటుందని జిల్లా మత్స్యశాఖ అధికారి శ్రీపతి అన్నారు. మండల పరిధిలోని లింగాల, కొడిశాల, అల్లిగూడెం గ్రామాల్లోని గిరిజనులకు లింగాల గ్రామంలోని ఊర చెరువులో మత్స్య శాఖ ఆధ్వర్యంలో నైపుణ్య పరీక్షలు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వలలు విసరడం, ఈత కొట్టడం, వల లాగడం లాంటి మూడు రకాల పరీక్షలు నిర్వహించామని తెలిపారు. అనంతరం ఐటీడీఏ పెసా జిల్లా సమన్వయకర్త కొమురం ప్రభాకర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గిరిజనుల్లో నీలి విప్లవాన్ని ప్రోత్సహిస్తుందన్నారు. అలాగే ఉచితంగా చేప పిల్లలు, 75 శాతం రాయితీపై వాహనాలను అందిస్తుందన్నారు. జీవిత బీమా పథకం కింద రూ. 5 లక్షలు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ మౌనిక నాగేశ్వరరావు, క్షేత్ర అధికారి రమేష్, అడ్వకేట్ మడి సాయిబాబు, తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు చింత కృష్ణ, మత్స్య శాఖ సిబ్బంది కృష్ణా, సాగర్ పాల్గొన్నారు.

కూలి పనులకు చిన్నారులు



ఏటూరునాగారం: మిర్చి ఏరేందుకు, భవన నిర్మాణ కార్మికులుగా చదువుకునే చిన్నారులు కూలి పనులకు వెళ్తున్నారు. పేదరికం ఒకవైపు, తల్లిదండ్రులకు అవగాహన లేమి కారణంగా చిన్నారులు పనులకు వెళ్లటం బాధాకరం. ఏటూరునాగారం మండల కేంద్రానికి వివిధ ప్రాంతాల నుంచి మహిళా కూలీలతో వచ్చి ఇక్కడ పనులు చేసుకొని ప్రైవేటు వాహనాల్లో తరలిపోతున్నారు. ఐసీడీఎస్, ఐసీపీఎస్ పథకాలు, సంరక్షణ చర్యలు బాగున్నాయని గొప్పలు చెప్పుకోవడం తప్పా పిల్లల బాగోగులు పట్టించుకున్న దాఖలాలు లేవు. ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

కోతులను పట్టుడే..



ఏటూరునాగారం: మండల కేంద్రంలోని 16 వార్డులోని ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న కోతులను పట్టే పనిలో నెల్లూరు నుంచి వచ్చిన టీం సభ్యులు నిమగ్నమయ్యారు. ఏటూరునాగారం గ్రామంలోని ప్రజలు అనేకమార్లు ప్రజాప్రతినిధులకు కోతులతో పడుతున్న ఇబ్బందులపై విన్నవించగా సర్పంచ్ రాంమూర్తి, పంచాయతీ కార్యదర్శి అశోక్‌లు నెల్లూరు నుంచి ప్రత్యేక టీంను పిలిపించి ఒక్కో కోతికి రూ.200ల చొప్పున ఇచ్చే విధంగా ఖరారు చేశారు. ఈ మేరకు టీం సభ్యులు పట్టిన కోతులను ప్రత్యేక బోనులో వేశారు. నాలుగు రోజుల పాటు కష్టపడితే 150 కోతులు చిక్కినట్లు వారు తెలిపారు. వీటితోపాటు కుక్కలను కూడా పట్టించి ప్రజలను రక్షించాలని స్థానికులు కోరుతున్నారు.

క్లుప్తంగా

అనుమానాస్పదంగా యువకుడి మృతి



ఘటనా స్థలిలో ప్రసన్నకుమార్ మృతదేహం

వర్ధన్నపేట: మండలంలోని నల్లబెల్లి శివారులో చెట్టుకు బైక్ ఢీకొని అనుమానాస్పదంగా ఓ యువకుడు మృతి చెందాడు. వర్ధన్నపేట ఏసీపీ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్‌లోని పుప్పాలగుట్టకు చెందిన అప్పికట్ల ప్రసన్నకుమార్(28) జిమ్ కోచ్‌గా జీవనం సాగిస్తున్నాడు. బుధవారం రాత్రి అతడు నల్లబెల్లి శివారులో తన బైక్‌తో చెట్టుకు ఢీ కొనగా పక్కనే ఉన్న కల్వర్టులో పడి తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఆస్తి అమ్మకం విషయంలో జరిగిన తగాదాలతోనే ప్రసన్నకుమార్‌ను మార్టిన్ లూథర్, సర్వే వెంకన్న, బస్వ రాజ్‌కుమార్, హెర్నార్డ్, శిరీష, జిమ్ ప్రవీణ్ హత్య చేసి కల్వర్టులో పడేశారని మృతుడి అక్క ప్రభావతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆస్తి తగాదాలకు సంబంధించి గతంలో మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్ పరిధిలో కేసు నడుస్తోందని, ఈ విషయమై సీపీని కలిసినట్లు మృతుడి అక్క తెలిపింది. కాగా.. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించేందుకు వరంగల్ ఎంజీఎంకు తరలిస్తుండగా.. వరంగల్–ఖమ్మం రహదారిపై వాహనాన్ని ఆపి మృతుడి బంధువులు ధర్నా చేశారు. వర్ధన్నపేట ఎస్సైలు రామారావు, మంగ మృతుడి బంధువులకు సర్దిచెప్పి మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు.

కొట్టుకొచ్చిన మృతదేహం

- మృతుడు హనుమకొండ వాసిగా గుర్తింపు

కేసముద్రం: హనుమకొండలోని సురేంద్రపురి కాలనీకి చెందిన కొండ్ర సురేశ్(44) మృతదేహం మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం భుక్యారాం తండా సమీపంలోని ఎస్సారెస్పీ కాలువలో గురువారం కొట్టుకొచ్చింది. ఎస్సై తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. సురేంద్రపురి కాలనీకి చెందిన సురేశ్ బుధవారం ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. ఆతర్వాత కనిపించకుండా పోవడంతో బంధువులు కేయూ పోలీస్‌స్టేషన్‌లో సురేశ్ అదృశ్యమైనట్లుగా కేసు నమోదు చేశారు. ఈక్రమంలో ఎస్సారెస్పీ కాలువలో కొట్టుకొచ్చిన మృతదేహం భుక్యారాం తండా సమీపంలోని డీబీఎం 48 ఎస్సారెస్పీ కాలువలో వంతెన పిల్లర్‌కు తట్టుకుని ఆగింది. ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని బయటకు తీయించారు. కాగా.. తమకు అందిన సమాచారం మేరకు మృతుడు హనుమకొండలోని సురేంద్రపురి కాలనీకి చెందిన సురేశ్ అనే వ్యక్తిగా గుర్తించినట్లు ఎస్సై తెలిపారు. మృతదేహాన్ని కేయూ పోలీస్‌స్టేషన్‌కు అప్పగించనున్నట్లు ఆయన తెలిపారు. కాగా.. సురేశ్ చింతగట్టు వద్ద ఎస్సారెస్పీ కాలువలో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలుస్తోందని ఎస్సై తెలిపారు.

కేఎంసీకి రీసెర్చ్ యూనిట్

- అనుమతిస్తూ రూ.1.25 కోట్లు మంజూరు చేసిన కేంద్ర ప్రభుత్వం
- మరో మైలురాయికి చేరుకున్న మెడికల్ కళాశాల
- ఏడాదిన్నరగా చేసిన కృషికి ఫలితం దక్కింది : ప్రిన్సిపాల్ మోహన్‌దాస్
- ఇటీవల రీజినల్ శిక్షణ కేంద్రానికి అనుమతి, సూపర్ స్పెషాలిటీ సీట్ల కేటాయింపు



ఎంజీఎం: వరంగల్ నగరంలోని కాకతీయ ప్రభుత్వ మెడికల్ కళాశాల (కేఎంసీ) మరో మైలురాయిని అధిగమించింది. 15 రోజుల క్రితం రీజినల్ శిక్షణ కేంద్రం ప్రారంభానికి అనుమతులు రాగా, వారం రోజుల క్రితం సూపర్ స్పెషాలిటీ సీట్లు సాధించుకుంది. ఈ క్రమంలోనే తాజాగా రీసెర్చ్ యూనిట్ ప్రారంభానికి కేంద్రం నుంచి అనుమతులు వచ్చాయి. పదిహేను రోజుల వ్యవధిలో మూడు ప్రత్యేకతలను సాధించుకోవడంతో కేఎంసీ అధికారులు, సిబ్బందిలో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. కాకతీయ మెడికల్ కాలేజీకి 2007లో రీసెర్చ్ యూనిట్ మంజూరు చేయాలని అప్పటి ప్రిన్సిపాల్ కేంద్ర ప్రభుత్వానికి విన్నవించారు. ఆ తరువాత విషయం మరుగునపడింది. ఏడాదిన్నర కాలం నుంచి కేఎంసీ ప్రిన్సిపాల్ మోహన్‌దాస్ రీసెర్చ్ యూనిట్ మంజూరు కోసం చేసిన విన్నపం ఎట్టకేలకు ఫలించింది. కేంద్రప్రభుత్వం రూ.1.25 కోట్ల నిధులు మంజూరు చేస్తూ రీసెర్చ్ సెంటర్ నెలకొల్పడానికి అనుమతినిస్తూ గురువారం కాలేజీకి ఉత్తర్వులు అందజేసింది. ఢిల్లీలోని ఐసీఎంఆర్ పథకంలో భాగంగా కేంద్రం ప్రభుత్వం ఈ రీసెర్చ్ యూనిట్‌లను దేశవ్యాప్తంగా ఐదు మంజూరు చేయగా అందులో ఒకటి సిద్దిపేట మెడికల్ కళాశాలకు, మరోటి కేఎంసీకి దక్కింది.

15 రోజుల వ్యవధిలో రెండు ప్రత్యేక అనుమతులు

కాకతీయ మెడికల్ కళాశాలలో నెల్స్ (నేషనల్ ఎమర్జెన్సీ లైఫ్ సపోర్టు) పథకంలో భాగంగా నెలరోజుల్లో రీజినల్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించడానికి పూర్తిస్థాయి అనుమతులు లభించి 15 రోజులు గడవకముందే రీసెర్చ్ సెంటర్ మంజూరుపై వైద్యులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నెల్స్ శిక్షణ కేంద్రం ప్రస్తుతం ఒక్క ఉస్మానియా మెడికల్ కళాశాలలో కొనసాగుతుంది. ఈనేపథ్యంలో ఇలాంటి శిక్షణ కేంద్రాన్ని వరంగల్‌లోనే ప్రారంభించాలని సంకల్పించి రూ.1.50 కోట్ల పరికరాలను ప్రభుత్వం కొనుగోలు చేసి కేఎంసీకి చేర్చింది. అంతేకాకుండా ఎమర్జెన్సీ సమయంలో ప్రాణాలు కాపాడేందుకు ఎలాంటి చర్యలు చేపట్టాలనే అంశంపై వైద్యసిబ్బంది, వైద్యులకు అందించే ఈ శిక్షణ కార్యక్రమాలపై 16మంది ప్రొఫెసర్ స్థాయి వైద్యులకు తర్ఫీదు ఇచ్చారు. ఈ శిక్షణ కేంద్రం అందుబాటులోకి వస్తే ఆకస్మికంగా కుప్పకూలే వారిని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ శిక్షణ పొందే అవకాశం ఉంటుంది. అంతేకాకుండా వైద్యులు జరిపే పరిశోధలకు పూర్తిస్థాయిలో సహకరించే విధంగా రీసెర్చ్ కేంద్రాన్ని సైతం కేఎంసీకి కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసి వైద్యవిద్యార్థుల విద్యబోధనలో కొత్త ఆలోచనలకు శ్రీకారం చుట్టింది. కాగా, వారం రోజులక్రితం ఐదు సూపర్‌స్పెషాలిటీ సీట్లు, ఐదు ఎమర్జెన్సీ మెడిసిన్ సీట్లు సాధించకోవడం మరో ప్రత్యేకతగా చెప్పుకోవచ్చు.

ఏడాదిన్నర కృషికి ఫలితం



ఏడాదిన్నర కృషి ఫలితంగా కేఎంసీకి రీసెర్చ్ సెంటర్ మంజూరైంది. ఇక్కడ రీసెర్చ్ యూనిట్ ఏర్పాటుకు 2007లో ఐసీఎంఆర్‌కు అప్పటి ప్రిన్సిపాల్ దరఖాస్తు చేశారు. కొన్ని కారణాల వల్ల దానిని తిరస్కరించారు. 2021 జూన్ నెలలో కేఎంసీ బోధన సిబ్బందితో సైంటిఫిక్ కమిటీ ఏర్పాటు చేసి కేంద్ర ప్రభుత్వం అడిగిన అన్ని రకాల నివేదికలను సమర్పించాం. వాటిని పరిశీలించిన కేంద్రం రూ.1.25 కోట్లు మంజూరు చేసింది. ఇందులో రూ.కోటితో రీసెర్చ్ యూనిట్ సంబంధించిన పరికరాలు, రూ.25 లక్షలతో సివి ల్ పనులు చేసుకోవడానికి అనుమతినిచ్చింది. ఈ రీసెర్చ్ యూనిట్ ఏర్పాటుతో కేఎంసీ, ఎంజీఎంలోని వైద్యులు, వైద్యసిబ్బందికి వివిధ కోర్సుల్లో పరిశోధనలు చేసేందుకు అవకాశం ఏర్పడుతుంది.

– మోహన్‌దాస్, కేఎంసీ ప్రిన్సిపాల్

'ఎస్సై' రాత పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

- వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ.రంగనాథ్



వరంగల్ క్రైం: ఈనెల 8,9 తేదీల్లో పోలీస్ శాఖలోని వివిధ విభాగాల్లో స్టైఫండరీ క్యాడెట్ ట్రైనీ ఎస్సై (సివిల్/ఏఆర్/టీఎస్ఎస్పీ/ఎస్పీఎఫ్/ఎస్ఏఆర్ సిపియల్/ఫైర్) అభ్యర్థులకు జరగనున్న రాత పరీక్షకు ఏర్పాట్లు పూర్తయ్యాయని, రాత పరీక్ష సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ.రంగనాథ్ తెలిపారు. ఎస్సై అభ్యర్థుల రాత పరీక్ష కోసం వరంగల్, హనుమకొండ ప్రాంతాల్లో మొత్తం 21 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. రెండ్రోజులపాటు నిర్వహించనున్న ఈరాత పరీక్షల్లో నాలుగు పేపర్లు రాత పరీక్షను నిర్వహిస్తామని, ఈ రాత పరీక్ష ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు కొనసాగుతుందని తెలిపారు. ఈ పరీక్షకు 14,380 మంది అభ్యర్థులు హాజరవుతుండగా.. ఇందులో 3,315 మంది మహిళా అభ్యర్థులు ఉన్నట్లు తెలిపారు.

అభ్యర్థులకు ముఖ్య సూచనలు..

- అభ్యర్థి ఒక నిమిషం ఆలస్యంగా వచ్చినా పరీక్షా కేంద్రంలోకి అనుమతించరు.
- అభ్యర్థి వెంట హాల్‌టికెట్ తెచ్చుకోవాలి.
- ఎలక్ట్రానిక్ వస్తువులు తీసుకురావొద్దు.
- ఓఎంఆర్ షీట్‌పై అనవసర సమాచారం, గుర్తులు, మత పరమైన చిహ్నాలు రాయకూడదు.
- అభ్యర్థులు మెహందీ, సిరా మొదలగునవి వారివారి చేతులపై గాని పాదాలపై గానీ రాసుకుని రాకూడదు.

ఆలిండియా పోటీలకు సాఫ్ట్‌బాల్ జట్టు



జట్టుతో కేయూ స్పోర్ట్స్ బోర్డ్ సెక్రటరీ డాక్టర్ సవితాజ్యోత్స్న

కేయూ క్యాంపస్: పంజాబ్ యూనివర్సిటీలో ఈనెల 5న ప్రారంభమై 9వ తేదీ వరకు జరిగే ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీ సాఫ్ట్‌బాల్ పోటీలకు కాకతీయ యూనివర్సిటీ సాఫ్ట్‌బాల్ పురుషుల జట్టును ఎంపిక చేసి పంపినట్లు స్పోర్ట్స్ బోర్డ్ సెక్రటరీ డాక్టర్ సవితాజ్యోత్స్న గురువారం తెలిపారు. జట్టులో ఆర్.గంగరాజు, పి.మనోహర్, బి.నవీన్ (ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మహబూబాబాద్), బి.సర్దార్, ఎం.అజయ్ (యూనివర్సిటీ ఆర్ట్స్అండ్ సైన్స్ కళాశాల, హనుమకొండ), జి.అన్వేశ్, బి.రాజశేఖర్, వి.అజిత్‌కుమార్ (యూసీపీఈ కేయూ), ఎస్.తరుణ్ (కిట్స్ వరంగల్), బి.ప్రవీణ్ (ప్రభుత్వ డిగ్రీ కళాశాల, రంగశాయిపేట), బి.భరత్, ఎం.విక్రమ్, ఎస్.సంతోశ్ (వీసీపీఈ బొల్లికుంట), ఎల్.కళ్యాణ్ (యూపీపీఈ కేయూ, ఖమ్మం), జి.చరణ్‌తేజ, కె.రాజశేఖర్ (ఎస్‌వీఎస్ డిగ్రీ అండ్ పీజీ కళాశాల, హనుమకొండ) ఉన్నారు. జట్టుకు కోచ్ కమ్ మేనేజర్‌గా హనుమకొండ జిల్లా భీమారం ఎస్‌వీఎస్ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ ఫిజికల్ డైరెక్టర్ ఎ.రవికుమార్ వ్యవహరిస్తున్నారు.

18న రామప్పలో ప్రపంచ వారసత్వ ఉత్సవాలు



కలెక్టర్‌తో రోషన్ స్వాయ్

ములుగు: ఈనెల 18న ప్రపంచ గుర్తింపు పొందిన ప్రఖ్యాత రామప్ప దేవాలయంలో ప్రపంచ వారసత్వ ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ వరంగల్ మేనేజర్, డివిజనల్ రిటైల్ సేల్స్ హెడ్ రోషన్ స్వాయ్ అన్నారు. ఈసందర్భంగా జిల్లా కేంద్రంలో గురువారం కలెక్టరేట్ కార్యాలయంలో కలెక్టర్ ఎస్.కృష్ణ ఆదిత్యని రోషన్ స్వాయ్, టి.బుచ్చయ్య మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందించి సత్కరించారు. ఈనెల 18న ఇంటర్నేషనల్ మోనుమేంట్స్, సైట్స్ వరల్డ్ హెరిటేజ్ దినోత్సవం సందర్భంగా రామప్ప దేవాలయంలో జరగనున్న ఉత్సవాలపై కలెక్టర్‌తో వారు చర్చించారు.

అప్పులబాధతో కౌలురైతు ఆత్మహత్య

గీసుకొండ: పంటల సాగుకు చేసిన అప్పులు తీర్చలేక గ్రేటర్ వరంగల్ నగరం 15వ డివిజన్ మొగిలిచర్లకు చెందిన కూనమల్ల భిక్షపతి(48) క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. భిక్షపతి అదే గ్రామానికి చెందిన ఇద్దరు రైతులకు చెందిన మూడెకరాల భూమిని కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నాడు. మూడేళ్ల నుంచి సాగు పెట్టుబడులకు రూ.10 లక్షల వరకు అప్పు చేశాడు. పంటలు సరిగ్గా పండక, పెట్టిన పెట్టుబడి రాక మనోవేదనకు గురయ్యాడు. బుధవారం రాత్రి క్రిమిసంహారక మందు తాగి ఆటోలో వచ్చి ఇంటిముందు పడిపోయాడు. విషయాన్ని బంధువులకు చెప్పడంతో వారు వరంగల్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి, అనంతరం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అదే రోజు చికిత్స పొందుతూ మృతి చెందాడు. గురువారం మృతుడి భార్య స్వరూప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు గీసుకొండ ఇన్‌స్పెక్టర్ సట్ల రాజు తెలిపారు.

ఆ వాల్ పోస్టర్లు నకిలీవే..

- ప్రకటించిన మావోలు



మావోయిస్టు పార్టీ విడుదల చేసిన లేఖ

ఏటూరునాగారం: ఈనెల 3న మండల కేంద్రంలోని చేపల మార్కెట్, జెడ్పీహెచ్ఎస్ పాఠశాల ప్రహరీకి వేసిన వాల్ పోస్టర్లు నకిలీవని, తాము వేయలేదని మావోయిస్టు పార్టీ జయశంకర్ మహబూబాబాద్, వరంగల్ పెద్దపల్లి జిల్లాల డివిజన్ కమిటీ కార్యదర్శి వెంకటేశ్ గురువారం లేఖలో పేర్కొన్నారు. ఏటూరునాగారం ప్రాంతంలో అధికార పార్టీ, ఇతర పేర్లతో కొన్ని పోస్టర్లు వేశారని, వాళ్లు కొంత మంది ప్రజావ్యతిరేకులు కూడా ఉన్నారని తెలిపారు. అయితే ఆ పోస్టర్లకు తమకు ఎలాంటి సంబంధం లేదని వెల్లడించారు. అవి నకిలీ పోస్టర్లని, కొంత మంది వ్యక్తిగత కారణాలతో వాటిని వేశారని, ఆ పోస్టర్లు వేసి పార్టీని తిరగనివ్వద్దని పోలీసులే వాటిని వేయించారని లేఖలో పేర్కొన్నారు. అందుకోసం వాటిని ఎవరు నమ్మొద్దని మావోయిస్టు వెంకటేశ్ తెలిపారు.

సింగిల్ పట్టి @ రూ.67 వేలు



వరంగల్ మార్కెట్‌కు వచ్చిన మిర్చి బస్తాలు

మార్కెట్‌లో మిర్చి ధరలు ఇలా..

రకం	గరిష్ట	కనిష్ట	మోడల్
తేజ	23,300	17,000	21,000
వండర్‌హాట్	36,000	31,000	33,000
యూఎస్–341	22,500	17,000	20,000
డీడీ	22,500	17,000	20,000
దీపిక	31,000	22,000	27,000
దేశీ	70,000	45,000	65,000
సింగిల్‌పట్టి	67,000	45,000	60,000
1048	23,500	16,500	21,000
తాలు	9,000	5,000	7,000

వరంగల్: వరంగల్ వ్యవసాయ మార్కెట్‌కు గురువారం రైతులు తీసుకొచ్చిన మిర్చి రకాల్లో సింగిల్ పట్టి రకానికి అత్యధికంగా క్వింటాలుకు రూ.67 వేలు ధర పలికింది. ఈ సీజన్ ప్రారంభమైన తర్వాత సింగిల్ పట్టి రకానికి మొదటిసారి మార్చి 29న గరిష్ఠంగా క్వింటాలుకు రూ.67వేలు పలికింది. అప్పటి నుంచి రూ.60 నుంచి 65 వేల వరకు ధరలు పలికిన సింగల్ పట్టికి గురువారం రోజున మరోసారి గరిష్ట ధరగా క్వింటాలుకు రూ.67వేలు పలికింది. తేజ రకం మిర్చి ధరలు గత వారం ఉన్న విధంగానే ఉండగా.. వండర్‌హాట్ రూ.500లు, యూఎస్–341 రూ.300లు, దీపిక రూ.1,500లు, సింగిల్‌పట్టి రూ.3వేలు, 1,048 రకానికి రూ.1,500లు క్వింటాలుకు పెరిగినట్లు మిర్చి యార్డు అధికారులు తెలిపారు. మార్కెట్‌కు సుమారు 35 వేల వరకు మిర్చి బస్తాలు యార్డుకు వచ్చినట్లు తెలిపారు.

'సీసీ'లో చిక్కకుండా చోరీ!

- బయ్యారం పీహెచ్‌సీలో రూ.65 వేల వస్తువుల అపహరణ



చోరీకి గురైన వస్తువుల వివరాలు తెలుసుకుంటున్న ఎస్ఐ రమాదేవి

బయ్యారం: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు సినీ ఫక్కీలో చోరీకి పాల్పడ్డారు. 24 గంటల పాటు రోగులకు ప్రాథమిక వైద్యం అందించే పీహెచ్‌సీలో బుధవారం రాత్రి ఇద్దరు ఉద్యోగులు విధుల్లో ఉన్నారు. అర్ధరాత్రి తర్వాత వాళ్లు లోపల గడియ పెట్టుకొని నిద్రపోయారు. ఈసమయంలో పీహెచ్‌సీలోకి ప్రవేశించిన గుర్తు తెలియని వ్యక్తులు పీహెచ్‌సీ ఆవరణలోని సీసీ కెమెరాకు చిక్కకుండా లోపలికి చొరబడ్డారు. సిబ్బంది నిద్రిస్తున్న గది తలుపులకు బయటి నుంచి గడిపెట్టి పీహెచ్‌సీలో ఉన్న 15 వేల విలువైన నాలుగు బ్యాటరీలు, సెటాప్‌బాక్స్, రెండు డోర్‌కర్టెన్స్, ఒక కంప్యూటర్ కీ బోర్డును ఎత్తుకెళ్లారు. తెల్లవారుజామున నిద్రలేచిన ఉద్యోగులు లోపలి నుంచి బయటకు వచ్చేందుకు ప్రయత్నించగా.. గడియ పెట్టినట్టు గుర్తించి స్థానికులను పిలిచి బయటకు వచ్చారు. ఘటనాస్థలాన్ని సీఐ బాలాజీ, ఎస్ఐ రమాదేవి పరిశీలించారు. కాగా.. పీహెచ్‌సీలో చోరీకి గురైన వస్తువుల విలువ రూ.65 వేలు ఉంటుందని పీహెచ్‌సీ వైద్యులు సాగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

స్వాతంత్ర్య సమరయోధుడి మృతి



తిరుపతయ్య(ఫైల్)

స్టేషన్‌ఘన్‌పూర్: కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ.. గురువారం తెల్లవారుజామున మండలంలోని తాటికొండకు చెందిన స్వాతంత్ర్య సమరయోధుడు, తెలంగాణ సాయుధ పోరాట యోధుడు అక్కినపెల్లి తిరుపతయ్య (98) మృతి చెందాడు. విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య, వైస్ ఎంపీపీ చల్లా సుధీర్ రెడ్డి, సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డితో పాటు వివిధ పార్టీల నాయకులు గ్రామానికి చేరుకుని తిరుపతయ్య మృతదేహంపై పూలమాలలు వేసి ప్రగాఢ సంతాపం తెలిపారు. మృతుడి కుటుంబానికి ఎమ్మెల్యే రూ.5 వేలు ఆర్థిక సాయం అందించారు.

సాయుధ పోరాట యోధుడు

తిరుపతయ్య ఆరోజుల్లో భూస్వాముల ఆగడాలు, నిజాం నిరంకుశ పాలన, కాశీమ్ రజ్వీ పోలీసులు పేద ప్రజలపై చేసే ధన, మాన, ప్రాణ దోపిడీ చూసి చలించి పెండ్యాల రాఘవారావు దళంలో మొదట సభ్యుడిగా చేరాడు. అనంతరం దళ నాయకుడిగా కొనసాగారు. రోజంతా దళ సభ్యులతో గుట్టల్లో, పొదల్లో సమావేశాలు ఏర్పాటు చేసి ప్రత్యర్థులపై దాడి చేసేందుకు ప్రణాళికలు రూపొందించేవాడు. తెలంగాణ సాయుధ పోరాట యోధుడైన తిరుపతయ్య ప్రత్యర్థుల గుండెల్లో రైళ్లు పరుగెత్తించేవాడు. అనంతరం వరంగల్, ఖమ్మం, గుల్బర్గా, జాల్నా జైళ్లలో జైలు జీవితం అనుభవించాడు. దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిన తర్వాత సీపీఐ, సీపీఎంలో పని చేశాడు.

పలువురి సంతాపం

తిరుపతయ్య మృతి విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే రాజయ్య, సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి తదితరులు గ్రామానికి చేరుకుని పార్థివదేహం వద్ద ప్రగాఢ సంతాపం తెలిపారు.

వడదెబ్బతో ఒకరు..



సత్యనారాయణ మృతదేహం

వెంకటాపురం(కె): వడదెబ్బ తగిలి ములుగు జిల్లా వెంకటాపురం(కె) మండల పరిధి అంకన్నగూడేనికి చెందిన గట్టు సత్యనారాయణ (55) మృతి చెందాడు. సత్యనారాయణ గురువారం మిర్చి తోటలో కూలీలతో పని చేయిస్తున్నాడు. మధ్యాహ్నం భోజనం చేసి ఇంటికి తిరిగి వచ్చేందుకు సిద్ధమవుతున్న సమయంలో ఎండ తీవ్రతకు ఒక్కసారిగా కళ్లు తిరిగి పడిపోయాడు. గమనించిన కూలీలు సత్యనారాయణను ఆస్పత్రికి తరలించేలోపే మృతి చెందాడు.

భార్య గొంతు నులిమి చంపిన భర్త అరెస్ట్



హత్య వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి

మల్హర్: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మల్హర్ మండలం రుద్రారం గ్రామంలో మూడెత్తుల లక్ష్మిని గొంతు నులిమి హత్య చేసిన కేసుల్లో భర్త మూడెత్తుల రమేశ్‌ను గురువారం అరెస్ట్ చేసినట్లు కాటారం డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. కాటారం పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ రామ్మోహన్ మాట్లాడుతూ.. లక్ష్మి వేరే వ్యక్తితో వివాహేతర సంబంధం పెట్టుకుందనే అనుమానంతోనే ఈనెల 5న ఉదయం 4గంటల సమయంలో గొంతు నులిమి చంపినట్లు తెలిపారు. రమేశ్ గురువారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో కొయ్యూరు పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయినట్లు ఆయన వెల్లడించారు. నేరం ఒప్పుకోవడంతో స్టేట్‌మెంట్ రికార్డు చేసి జ్యూడీషియల్ రిమాండ్ నిమిత్తం భూపాలపల్లి మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపర్చినట్లు వెల్లడించారు. ఆయన వెంట కాటారం సీఐ రంజిత్‌రావు, మహా ముత్తారం ఎస్సై సుధాకర్, కానిస్టేబుల్స్ హరికుమార్, రమేశ్‌నాయక్ ఉన్నారు.

భారతీయత మనల్ని కలుపుతుంది

- సినీ హీరో పవన్ కల్యాణ్
- నేటి నుంచి నిట్‌లో స్ప్రింగ్‌స్ప్రీ-23 వేడుకలు



నిట్ క్యాంపస్‌లో మాట్లాడుతున్న సినీ హీరో పవన్ కల్యాణ్

కాజీపేట అర్బన్ : 'కళలకు పుట్టినిల్లు అయిన ఓరుగల్లుకు కోటి దండాలు. హలో నిట్ వరంగల్. మీదే ఈ తరం' అంటూ ప్రముఖ సినీహీరో పవన్ కల్యాణ్ యువతలో జోష్ నింపారు. నిట్ వరంగల్‌లో శుక్రవారం నుంచి మూడు రోజులపాటు జరగనున్న వసంతోత్సవ వేడుకలు స్ప్రింగ్‌స్ప్రీ-23 ప్రారంభోత్సవానికి గురువారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి స్ప్రింగ్‌స్ప్రీ-23 కల్చరల్ ఫెస్ట్‌ను లాంఛనంగా ప్రారంభించి మాట్లాడారు. ఏకశిలా నగరానికి, రాణి రుద్రమదేవి పాలించిన, పుట్టుక నీది చావు నీది బతుకంతా దేశానిది అన్న కాళోజీ, భాగవతం రచించిన బమ్మెర పోతన నడియాడిన ఓరుగల్లుకు రావడం ఆనందంగా ఉందన్నారు. భారతదేశంలో వివిధ ప్రాంతాల్లోని సంస్కృతీసంప్రదాయాలు భారతీయతలోని ఏకత్వం మనల్ని కలుపుతుందని, ఇందుకు నిదర్శనమే నాటు నాటు పాట ఆస్కార్ సాధించడమని పేర్కొన్నారు. నిట్ వరంగల్‌లో నిర్వహిస్తున్న కల్చరల్ ఫెస్ట్ మనల్ని కలిపిందన్నారు. 'నిట్ వరంగల్‌లో నిర్వహిస్తున్న కల్చరల్ ఫెస్ట్ స్ప్రింగ్‌స్ప్రీ-23 వేడుకలకు అతిథిగా పిలవగా.. నేను రెగ్యులర్ కళాశాలకు వెళ్లిన విద్యార్థిని కాదు, బాగా చదువుకోలేదు. కానీ నిత్యపఠనం చేసే విద్యార్థిని, నేను మీ కళాశాలకు రావడానికి అర్హుడినా?' అని అడిగానన్నారు. 'జీవితంలో షార్ట్‌కట్స్ వెతుకోవద్దు అపజయాలను ధైర్యంగా ఎదుర్కొని విజయం సాధించాలి' అని అన్నారు. కార్యక్రమంలో నిట్‌డైరెక్టర్ ఎన్వీ రమణారావు, డీన్ స్టూడెంట్ వెల్ఫేర్ పులి రవికుమార్, ఫ్యాకల్టీ అడ్వైజర్ హీరాలాల్, స్టూడెంట్ కోఆర్డినేటర్స్ తదితరులు పాల్గొన్నారు.